

నేడు రాజ్యాంగ పీఠిక పఠించాలి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 11.30 గంటలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్.. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఆర్డీఓలు, పోలీసు శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర శాఖల అధికారులు తమ పరిధిలోని సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

నట్టేట ముంచిన వేరుశనగ

- వర్షాభావంతో దెబ్బతిన్న పంట
- చెట్టుకు నాలుగైదు కాయలే
- పెట్టుబడులు కూడా రాలేదని రైతుల ఆవేదన



వేరుశనగ చెట్టుకు నాలుగు, ఐదుకాయల దిగుబడి

మడకశిర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ రైతు మరోసారి నట్టేట మునిగిపోయాడు. రాష్ట్ర మంతా ఈసారి విస్తారంగా వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మడకశిర ప్రాంతంలో మాత్రం వర్షాభావంతో వేరుశనగ పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సకాలంలో వర్షా లు రాకపోవడంతో పంట ఎండిపోయి దిగుబడి పడిపోయింది. ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందించి ఎండిపోయిన వేరుశనగ పంటను తొలగించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో వేరుశనగ విడతల వారిగా సాగుచేశారు. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు పడడంతో సాగు చేసిన కొంత మంది రైతులకు పెట్టిన ఖర్చులన్నా చేతికి అందాయి. చివరిలో కొద్ది పాటి వర్షానికి సాగు చేసిన రైతులకు వర్షాలు కురవక పంట దెబ్బతిన్నది. చెట్టుకు నాలుగు, ఐదు కాయలు మాత్రమే కాశాయి. అవి కూడా నాణ్యత లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు నాలుగు లేక ఐదు బస్తాలు దిగుబడి వస్తుందని, చివరిలో పంట తొలిగించేందుకు పెట్టిన ఖర్చులు కూడా చేతికి అందలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వేరుశనగ కాయలను వేరు చేస్తున్న కూలీలు

వర్షాధార పంటలే జీవనాధారం

కర్ణాటక సరిహద్దు ప్రాంతమయిన మడకశిర నియోజకర్గంలో ఎలాంటి సాగు నీటి వనరులు లేవు. దీంతో ఈ ప్రాంతంలో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రత్యేకించి ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటే జీవనాధారం. దశాబ్దకాలంగా అతివృష్టి, అనావృష్టి కారణంగా వేరుశనగ పంట దెబ్బతిని పూర్తిగా నష్ట పోయారు. గత సంవత్సరం వేరుశనగ పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురవక పోవడంతో పంట ఎండిపోయి పెట్టిన ఖర్చులు కూడా చేతికి అందలేదు. ఈసారి కూడా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటదెబ్బతిని పెట్టిన ఖర్చులు కూడా గిట్ట లేదు. పశువులకు గ్రాసమయినా దక్కుతుందని రైతులు ట్రాక్టర్లు పెట్టి పంటను తొలిగించారు. కాయలు కూడా నాణ్యత లేక డొల్లగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పంట పెట్టుబడులకు అధిక వడ్డీలకు తెచ్చి అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా రాలేదు



నేను రెండున్నర ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. ఎకరా పంట సాగు చేయడానికి రూ.20వేల దాకా ఖర్చు అయింది. విత్తనం వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.50 వేల దాకా పెట్టుబడులు పెట్టా. వర్షాలు రాకపోవడంతో పంట తిని పూర్తిగా నష్టపోయాం. పెట్టుబడులు కూడా రాలేదు. చెట్టుకు 4నుంచి 5 కాయలే కాశాయి. వేరుశనగ పంటను తొలగించేందుకు ట్యాంకరు ద్వారా నీటి తడి అందించాం. అధిక వడ్డీకి అప్పు తెచ్చి వేరుశనగ పంట సాగు చేశాం. పంట పూర్తిగా నష్టం పోయాం. ప్రభుత్వం పరిహారం చెల్లించాలి ఆదుకోవాలి. -సాకమ్మ, రైతు, మడకశిర

కంది రైతు గుండె జల్లు..!

చిరుజల్లులతో పంటపై ప్రభావం



ధర్మవరం మండలంలో పూత, పిందె దశలో ఉన్న కందిపంట

- రాలిపోతున్న పూత, పిందె
- వరుసగా పంటను దెబ్బతీస్తున్న తుఫాన్లు

ధర్మవరం రూరల్/రొద్దం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురుస్తోంది. కందిపంటపై తుఫాన్ తీవ్ర ప్రభావం చూపుతోంది. రెండువారాల క్రితం తుఫాన్ల ప్రభావంతో పూత, పిందె చాలా వరకు రాలిపోయింది. దీంతో రైతులు రసాయనిక మందులు పిచికారి చేయడంతో మళ్లీ పూతపిందె దశకు చేరుకుంది. మళ్లీ అల్పపీడనం ప్రభావంతో ప్రస్తుతం చిరుజల్లులు పడుతుండడంతో కందిరైతుల గుండెల్లో గుబులురేపుతోంది. శుక్రవారం రాత్రి నుంచి మేఘాలు కమ్ముకుని అక్కడక్కడ వర్షం పడుతుండటంతో ఉన్న పంట కూడా చేతికందకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో ధర్మవరం మండలంలో ఏడు వేల ఎకరాల్లో కంది సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ముందస్తుగా సాగుచేసిన కందిపంటకు కాయలు ఏర్పడ్డాయని, వర్షం కురిస్తే పంటంతా పోయి తీవ్ర నష్టం వస్తుందని రైతులు (మిగతా 6వ పేజీలో...)

వర్ష సూచనతో ఆందోళనగా ఉంది



మేఘాలు కమ్ముకుని వర్షాలు కురుస్తుండటంతో పూత పిందె రాలిపోతాయని ఆందోళనగా ఉంది. వరుసగా తుఫాన్ల ప్రభావంతో పంటపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం పూత, పిందెలతో కందిపంట ఉంది. దిగుబడి సమయంలో వర్షాలు కురిస్తే పురుగుల ఉధృతి పెరుగుతుందని ఆందోళనగా ఉంది.
- కొంకా గంగాద్రి, వసంతపురం, ధర్మవరం మండలం



రొద్దం మండలం కల్లుకుంట వద్ద కందిపోయిన కందిపంట

వెళ్లొస్తాం స్వామీ..!

సత్యసాయి భక్తుల తిరుగు పయనం

పుట్టపర్తి బస్టాండు, రైల్వే స్టేషన్‌లో రద్దీ



సత్యసాయి రైల్వే స్టేషన్‌లో రద్దీ



"20 ఏళ్ల నుంచి ప్రశాంతి నిలయానికి వస్తున్నాను. ప్రపంచంలో ఎక్కడా లేని ప్రశాంతత ఇక్కడ ఉంది. నా శరీరం రీచార్జ్ అవుతుంది. మాటల్లో చెప్పలేని వింత అనుభూతి, ఆనందం కలుగుతాయి. భగవాన్ శతజయంతి ఉత్సవాలు అత్యద్భుతంగా జరిగాయి. ఇంతటి గొప్ప పండుగలో నేను పాల్గొనడం బాబా ఆశీర్వాదమే. పోలీసులు చాలా మర్యాదగా ప్రవర్తించారు. సాయిరాం సాయిరాం అంటూ భక్తులను నియంత్రించడం అభినందనీయం. చాలా సంతోషంగా వెనుదిరుగుతాను.." ఇదీ.. ఫ్రాన్స్‌కు చెందిన జేబాలన్ అనుభూతి. శతజయంతి వేడుకల తరువాత భక్తులందరూ పుట్టపర్తిని వీడి సంతోషంగా తిరుగు ప్రయాణమవుతున్నారు.

6

కల నిజమాయెగా..!

మడకశిర రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం

పెనుకొండలోకి గోరంట్ల, పుట్టపర్తిలోకి అమడగూరు

మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు ఓకే చెప్పిన సీఎం 7

లింగ వివక్షను రూపుమాపాలి

- జేసీ మౌర్య భరద్వాజ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ ఇతర అధికారులు

పుట్టపర్తి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షను రూపుమాపడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జేసీ మౌర్య భరద్వాజ్ సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లింగ వివక్షతకు వ్యతిరేకంగా రూపొందించిన ప్రచార పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లో మం గళవారం జేసీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. లింగ వివక్షపై డిసెంబరు 25వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తు న్నామన్నారు. సమాజంలో మహిళల స్థానం బలోపేతం చేయడం, సమాన అవకాశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధానం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సీడీపీఓ గాయత్రి, ఏపీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా దందా



దుద్దేబండ వద్ద వ్యవసాయ పొలంలో వెలసిన అక్రమ లేఅవుట్

- వ్యవసాయ పొలాల్లో అక్రమ లే అవుట్లు
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- అక్రమ లేఅవుట్లపై ఒక్కోచోట ఒక్కోలా..!


పెనుకొండ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ లే అవుట్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. వైసీపీ పాలనలో ప్రశ్నించేవారు లేకపోవడంతో పలు వ్యవసాయపొలాల్లో అక్రమంగా లే అవుట్లు వేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా ప్లాట్లు విక్రయిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు నోరు మెదపకపోవడంతో దందా జోరుగా సాగుతోంది. అయితే ఈ లే అవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఇంటి నిర్మాణ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా వ్యవసాయ భూముల్లో లే అవుట్లు వేయాలంటే తొలుత వాటిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. ఇందుకోసం మార్కెట్ ధరకు అనుగుణంగా ప్రభుత్వానికి రుసుము చెల్లించాలి. తర్వాత లే అవుట్ అప్రూవల్ పొందాలి. మండలంలో ఇవేవి లేకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు. ఈ తంతు ప్రధానంగా మండలంలోని దుద్దేబండ గ్రామ పంచాయతీతోపాటు పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో జోరుగా సాగుతోంది.



పెనుకొండ పట్టణంలో అక్రమ లేఅవుట్ల రాళ్లు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

ఒక చోట ఒకలా..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీఓఎంఎస్ నంబరు 134ను జారీ చేసింది. దీని ప్రకారం అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోకుండా ఉంటే వాటికి అనుమతులు తీసుకోవాలని కోరింది. అయినా అనుమతులు తీసుకోకపోవడంతో పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో 698 సర్వే నంబరులో మూడెకరాలు, 303, 304, 331సర్వేనంబర్లలో రెండెకరాల్లో వేసిన అనధికార లేఅవుట్ల రాళ్లను నగరపంచాయతీ అధికారులు తొలగించి కార్యాలయానికి తరలించారు. అయితే ఇదే తరహాలో మండల పరిధిలోని చంద్రగిరి, దుద్దేబండ పరిధిలో 454సర్వేనంబరు లో ఆరు ఎకరాలు, మరో రెండు ఎకరాల వ్యవసాయ భూముల్లో వేసిన లేఅవుట్లపై మాత్రం చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. అధికారుల ద్వంద్వ వైఖరిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.



ఏడాది కిందట ఇచ్చిన నోటీసు

నోటీసులతో సరి

పెనుకొండ మండలంలో అక్రమ లేఅవుట్లపై యజమానులకు గత ఏడాది మేలో పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి చర్యలు తీసుకోకపోవడంలో అలసత్వం వహించారని విమర్శలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని గత ఏడాది యజమానులకు నోటీసులు అందించాం. అయినా వారు స్పందించలేదు. ఉన్నతాధికారులకు తెలిపి అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసేవారు ఇబ్బందులు ఎదుర్కొంటారు.
-షామీర్, దుద్దేబండ పంచాయతీ కార్యదర్శి

గుడిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తాం



గుమ్మయ్యగారిపల్లి రైతు సదస్సులో పాల్గొన్న మంత్రి సవిత

- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- గుమ్మయ్యగారిపల్లిలో 'రైతన్నా.. మీకోసం'

గోరంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి, హంద్రీనీవా జలాలు తరలించి గోరంట్ల, చిలమత్తూరు మండలాలకు తాగు, సాగునీరు అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని గుమ్మయ్యగారిపల్లిలో మంగళవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వాయర్ ఏర్పాటు గురించి ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే పంచ సూత్రాల గురించి రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రెండు విడతలో 46.85లక్షల మంది రైతులకు రూ.3,135కోట్లు జమ చేశామన్నారు. 18 నెలల పాలనలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ, సంపద సృష్టించి, పేదల కోసం సంక్షేమ పథకాల అమలు చేసి, అనేక పరిశ్రమలు తీసుకువస్తున్నారని కొనియాడారు. ఒక వైపు రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే, జగన్మోహన్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరోపించారు. పెళ్లికి వెళ్లినా, చావుకు వెళ్లినా, పరామర్శకు, చివరకు కోర్టుకు వెళ్లినా రప్పారప్పా అంటున్నారని, ఇదేం పద్ధతి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మయ్యగారిపల్లిలో రూ.13.5లక్షలతో సీసీరోడ్డు, గోరంట్ల వినాయక నగర్‌లో రూ.10లక్షల ఉపాధి పథకం నిధులతో సీసీరోడ్డు పనులకు ఆమె భూమి పూజ చేశారు. త్వరలో గోరంట్లలో రూ.3కోట్లతో 62 పనులు ప్రారంభిస్తామన్నారు. మండలానికి కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి మల్లాపల్లి వద్ద అరటి తోట, వేరుశనగ, పొలాలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఆమెతోపాటు తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కమలాబాయి, పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, ఏఓ శంకర్‌నాయక్, ట్రాన్స్‌కో ఏఈ క్రిష్ణశ్రీనివాస్, పలువురు అధికారులు, కూటమి నాయకులు కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, సంతోష్, సోముశేఖర్, నిమ్మల విద్యాధరణీ, నిమ్మల శ్రీధర్, తదితరులున్నారు.

అసలు ఏమైందో..?

- దొంగిలించారా.. అధికారులే తరలించారా?
- మండ్లిపల్లి పంప్‌హౌస్ వద్ద మూడు విద్యుత్ మోటార్లు మాయం



పంపు హౌస్‌లో కనిపించని మోటార్లు

తనకల్లు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లి శ్రీసత్యసాయి తాగునీటి పథకం పంప్ హౌస్ వద్ద మూడు విద్యుత్ మోటార్లు చోరీ అయ్యాయనే అనుమానాలు కలుగుతున్నాయి. మోటార్లు కనిపించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి సంపు నిర్మాణం చేపట్టింది. ఈసంపు నుంచి మండలంలోని మబ్బువారిపల్లి, చిన్నపల్లి, పెద్దపల్లి తదితర గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించడానికి 40హెచ్‌పీ విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసింది. గతంలో ఈసంపులో పనిచేయడానికి సిబ్బందిని కూడా నియమించారు. వైసీపీ పాలనలో వారిని తొలగించారు. తర్వాత సంపులకు నీరు రాకుండా ఆగిపోయాయి. దీంతో మోటార్లు బిగించిన పంప్ హౌస్‌కు తాళాలు వేశారు. ఇటీవల పంపుహౌస్ షట్టర్‌ను తొలగించి, లోపలున్న 40హెచ్‌పీ విద్యుత్ మోటార్లను మూడింటిని దొంగిలించారు. అయితే షట్టర్‌ను ఎప్పటిలాగే ఉంచడంతో ఎవరికి ఎలాంటి అనుమానం రాలేదు. ఇటీవల కొంతమంది తాళాలు లేని విషయం గుర్తించి షట్టర్ ఎత్తి చూడగా లోపల విద్యుత్ మోటార్లు మాయమైనట్లు గుర్తించారు. అయితే దొంగతనం జరిగిందా? లేక అధికారులే ఇతర ప్రాంతాలకు తరలించారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈవిషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ శ్రీనివాసులను వివరణ కోరగా తాను మూడు నెలల కిందటే కదిరికి ఇన్‌చార్జ్‌గా వచ్చానని, తనకు ఇంకా పంపు హౌస్‌గురించి అవగాహన లేదన్నారు. త్వరలోనే రికార్డులు పరిశీలించి, తగిన విధంగా స్పందిస్తానని తెలిపారు.

పరుగుల దీక్ష

జాతీయస్థాయి పోటీలకు మడకశిర విద్యార్థిని



6

పైసలిస్తేనే మ్యుటేషన్..!



తహసీల్దార్ కార్యాలయాల్లో హెచ్చుమీరిన అవినీతి

ఒక్కో ఫైల్‌కు రూ.10వేల నుంచి రూ.50వేలు

పర్యవేక్షించని రెవెన్యూ ఉన్నత యంత్రాంగం

6

వాస్తవాలు వెలుగు చూస్తాయా..?

- మేజర్ పంచాయతీల్లో అక్రమాలపై విచారణకు ప్రభుత్వ ఆదేశం

పల్లెలకూ అన్న క్యాంటీన్లు..



నిర్మాణం పూర్తయిన రాప్తాడు అన్న క్యాంటీన్ భవనం

పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు మరిన్ని ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు నగరాలు, పెద్ద పట్టణాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లను మండల, నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఏర్పాటు చేస్తోంది. రూరల్ అన్న క్యాంటీన్ల పేరుతో ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి జిల్లాకు నాలుగు మంజూరయ్యాయి. శరవేగంగా వాటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. రాప్తాడులో దాదాపు పూర్తయి, నిర్మాణానికి సిద్ధంగా ఉంది.

అనంతపురం క్రైం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ల ద్వారా ప్రభుత్వం నామమాత్రపు ధరకే టిఫిన్లు, భోజనం అందిస్తోంది. 2019 ముందే అన్న క్యాంటీన్లు పెట్టి కోట్లాదిమంది పేద ప్రజలకు టీడీపీ ప్రభుత్వం కడుపు నింపింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. అన్న క్యాంటీన్లను నిర్వీర్యం చేయాలని చూసింది. ఐదేళ్లు పట్టెడు అన్నం కూడా పెట్టలేదు. కరోనా (మిగతా 6వ పేజీలో...)

- పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు
- రూరల్ అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్ణయం
- ఉమ్మడి జిల్లాకు 4 మంజూరు
- శరవేగంగా పనులు
- రాప్తాడులో ప్రారంభానికి సిద్ధం

వెళ్లొస్తాం స్వామీ..!

- సత్యసాయి భక్తుల తిరుగు పయనం
- పుట్టపర్తి బస్టాండు, రైల్వే స్టేషన్‌లో రద్దీ



రైల్వే స్టేషన్‌లో భక్తులు

సత్యసాయి శతజయంతి వేడుకలకు వచ్చిన భక్తులు తమ స్వస్థలాలకు తిరిగి వెళుతున్నారు. దీంతో పుట్టపర్తి బస్టాండు, సత్యసాయి రైల్వే స్టేషన్ కిటకిటలాడుతున్నాయి. దేశవిదేశాల నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులు దాదాపు రెండు వారాలపాటు వేడుకలలో పాల్గొన్నారు. మహా సమాధిని దర్శించుకున్నారు. పుట్టపర్తి పట్టణంలో సందడి చేశారు. ప్రశాంతి నిలయంలో జరిగిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను కన్నులారా వీక్షించి తన్మయత్వం చెందారు. వేడుకలు ముగియడంతో అందరూ ఖాళీచేసి, బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాలలో వెళ్లిపోతున్నారు.



మునుపటి కళ

సత్యసాయి బాబా 2011, ఏప్రిల్ 24న శివైక్యం చెందారు. ఆయనను కడసారి చూసుకునేందుకు లక్షల మంది తరలివచ్చారు. ఆ తరువాత జయంతి వేడుకలు, ఆరాధనోత్సవాలకు భక్తులు వస్తున్నారు. శత జయంతి వేడుకలకు వచ్చినంతగా రాలేదు. సుమారు 14 సంవత్సరాల తరువాత మునుపటి కళ కనిపించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్‌లు, హైకోర్టు న్యాయమూర్తులు, క్రీడాకారులు, సినీతారలు.. ఇలా అందరూ వేడుకలకు తరలివచ్చారు. సత్యసాయి జయంతిని ప్రభుత్వ పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం, ట్రస్ట్‌తో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పుట్టపర్తికి మళ్లీ మంచి రోజులు వచ్చాయన్న ఆనందం అందరిలో కనిపిస్తోంది.

-ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

రైతులు ఒకేసారి ఒకే రకం పంట వేయవద్దు

దీనిపై అధికారులు అవగాహన కల్పించాలి

రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులంతా ఒకేసారి ఒకే రకం పంట సాగుచేస్తే గిట్టుబాటు ధరలేక నష్టాలు వస్తున్నాయనీ, ఈ పద్ధతిని విడనాడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మామిళ్లపల్లిలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. రైతన్నల ఇళ్ల వద్దకే వెళ్లి 'అన్నదాత సుఖీభవ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా' అని ఆరాతీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పంపిన కరపత్రాన్ని అందజేశారు. అనంతరం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి రైతులతో సమావేశమై పంటల సాగుపై చర్చించారు. రైతులంతా ఒకేరకం పంట, ఒకే సీజన్‌లో సాగుచేయడం ద్వారా దిగుబడులు అధికమై ధరలు తగ్గి నష్టపోతారన్నారు. వేర్వేరు పంటలు పెట్టుకోవాలన్నారు. ఎప్పుడు, ఏ పంటలు సాగుచేయాలి, తెగుళ్ల నివారణకు ఎటువంటి మందులు పిచికారీ చేయాలన్న అంశాలపై రైతులకు అధికారులు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కిష్టయ్య, ఏఓ మాధురి, డీసీఎంఎస్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్లు నెట్టెం వెంకటేష్, బోయపాటి సుధాకర్ చౌదరి, కన్వీనర్ పోతులయ్య, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు నాయకులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 18 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



పైసలిస్తేనే మ్యుటేషన్..!



తహసీల్దార్ కార్యాలయాల్లో హెచ్చుమీరిన అవినీతి

ఒక్కో ఫైల్‌కు రూ.10వేల నుంచి రూ.50వేలు

పర్యవేక్షించని రెవెన్యూ ఉన్నత యంత్రాంగం

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి హెచ్చుమీరింది. ముడుపులిస్తేనే మ్యుటేషన్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ రికార్డులలో ఆస్తి యజమాని మార్పు విషయంలో మ్యుటేషన్ కీలకం. తండ్రి లేదా తల్లి పేరుతో ఉన్న ఆస్తి వారు మరణిస్తే వారి కుమారుల పేరుతో ఆన్‌లైన్ రికార్డుల్లో ఎక్కించడానికి మ్యుటేషన్ కీలకమవుతుంది. రెవెన్యూ శాఖలో అమ్మకం, వారసత్వం లేదా బహుమతి వంటి లావాదేవీల అనంతరం ఆస్తి రికార్డులలో యజమాని పేరును మార్చడాన్ని మ్యుటేషన్ అంటారు. ప్రస్తుతం ఈ మ్యుటేషన్ రెవెన్యూ అధికారులకు మంచి ఆదాయ మార్గంగా మారింది. అవసరం కొద్దీ రైతులు, ఇతర వర్గాలు ముడుపులు ఇచ్చి తమ పని చేయించుకుంటున్నారు. రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడం వల్లనే ఈ అవినీతి తారస్థాయికి చేరిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.10వేల నుంచి రూ.50వేల దాకా..

మ్యుటేషన్ విషయంలో డబ్బు అందితేనే పని పూర్తవుతోంది. గుట్టుచప్పుడు కాకుండా బేరాలు మాట్లాడేసుకుని ఆ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. మ్యుటేషన్ చేయాలంటే కనీసం రూ.10వేలతో బేరాలు సాగుతున్నాయని తెలిసింది. తక్కువ సెంట్లలో ఉన్న భూమికి అందులోనూ ధరలు లేని భూములకైతేనే ఆ రేటు. ఎకరాలలో మ్యుటేషన్ చేయాలంటే మాత్రం రూ.30వేల పైమాటే చెల్లుబాటవుతోంది. ఇక పట్టణాలు, మండల కేంద్రాల పరిధిలోని అధిక ధరలున్న భూములకు రూ.50వేలకు తక్కువ తీసుకోవడం లేదని సమాచారం.

వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు...

వాస్తవానికి ప్రస్తుతం ఆటో మ్యుటేషన్ విధానం అమల్లోకి వచ్చింది. ఒకరి పేరు మీదున్న ఆస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవగానే మరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ అవుతుంది. దీంతో పాటు కొనుగోలు చేసిన వ్యక్తి పేరు ఆన్‌లైన్‌లో రికార్డుల్లో ఆస్తి యజమానిగా నమోదవుతుంది. అయితే గతంలో జరిగిన రిజిస్ట్రేషన్ల విషయంలో పేర్లను మ్యుటేషన్ ద్వారా ఎక్కిస్తున్నారు. వారసత్వం ఆస్తికి సంబంధించి కుటుంబ పెద్దలు మృతి చెందిన సందర్భాల్లో వారి పిల్లల పేర్లు ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ ద్వారానే నమోదు చేయిస్తున్నారు. ఇదంతా క్షేత్రస్థాయిలో వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు వ్యవహారం నడుస్తోంది. కొన్ని సందర్భాల్లో వీఆర్ఓల స్థాయిలోనే బేరాలు మాట్లాడేసుకుంటున్నారు. మరికొంత మంది నేరుగా తహసీల్దార్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో మ్యుటేషన్ వ్యవహారం బాగానే నడుస్తోంది. ముడుపులు ముట్టాకే పనులు జరుగుతున్నాయి. జిల్లాలో తహసీల్దార్‌లు లేని కార్యాలయాల్లో కొందరు డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జ్‌లుగా ఉండగా, కొన్ని చోట్ల రెండు మండలాల్లో తహసీల్దార్లే చూస్తున్నారు. కీలకమైన ఫైల్స్, పైసలుందే వాటి విషయంలో తహసీల్దార్లే ముందుంటున్నట్లు సమాచారం.



డబ్బు వసూళ్లను ఉపేక్షించం

మ్యుటేషన్ విషయంలో డబ్బు వసూలు చేయడాన్ని ఉపేక్షించేదిలేదు. ఇలాంటి విషయాలపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా మ్యుటేషన్, ఇతర విషయాల్లో లంచం అడిగారా..? అని నేరుగా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నారు. మ్యుటేషన్‌కు సంబంధించి అవినీతికి పాల్పడకూడదు. తహసీల్దార్ కార్యాలయాల్లో డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం.

-మలోల, డీఆర్ఓ

ఆటోమ్యుటేషన్‌లో అవాంతరాలు

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవగానే జరగాల్సిన ఆటో మ్యుటేషన్‌లోనూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు ఐదు నుంచి పదెకరాల భూమిని తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న సమయంలో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. తాజాగా అనంతపురం సమీపంలోని ఓ గ్రామ పరిధిలో 1.5ఎకరాలను ముగ్గురు వ్యక్తులు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ముగ్గురి పేరుతోనూ రిజిస్ట్రేషన్ అయినట్లు వచ్చింది. అయితే ఇక్కడ ఒక్కొక్కరి పేరుతో 1.5ఎకరాలున్నట్లు డాక్యుమెంట్‌లో చూపడం గందరగోళానికి దారి తీస్తోంది. దీంతో ఆ భూమిని వ్యవసాయేతర భూములు(కమర్షియల్)గా కన్వర్షన్ చేసుకునే విషయంలో రెవెన్యూ శాఖకు చార్జీలు చెల్లించే విషయంలోనూ సాంకేతిక పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదివరకు డాక్యుమెంట్ తెలుగులోనే వచ్చేది.. ఆటో మ్యుటేషన్‌లో తెలుగు, ఇంగ్లిష్ రెండింట్లోనూ వస్తున్నాయి. వీటిలో ఉన్నత స్థాయిలో మార్పులు జరిగితే గందరగోళానికి తెరతీసినవారవుతారు. లేకపోతే మరింత ఆందోళన వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

వాస్తవాలు వెలుగు చూస్తాయా..!

- కొందరు కార్యదర్శులు.. వైసీపీ సర్పంచ్‌ల కుమ్మక్కు
- మేజర్ పంచాయతీల్లో అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలు మేజర్ పంచాయతీల్లో కోట్లలో అక్రమాలకు పాల్పడినట్లు.. పలు ప్రాంతాల్లో ఆడిట్‌లో వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కై వైసీపీ సర్పంచులు దోపిడీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ ఈనెల 15న మెమో జారీచేశారు. జిల్లా పంచాయతీ అధికారులు మేజర్ పంచాయతీల్లో విచారణ చేసి అక్రమాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే పలు జిల్లాల్లో డీపీఓలు మేజర్ పంచాయతీల్లో అక్రమాలు వెలికితీసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో మాత్రం పంచాయతీ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు ఉన్నారన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 49 మేజర్ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 6 నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. మిగిలిన వాటిలో 43 మేజర్ గ్రేడ్-1 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా జిల్లా కేంద్ర సమీపంలో ఉన్న పంచాయతీలతో పాటు మండల కేంద్రాల్లో ఉన్న పంచాయతీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయన్న విమర్శలున్నాయి. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా నియామకం కావడానికి కూడా పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెప్పాల్సి వస్తోందన్న చర్చ జరుగుతోంది. సీటులో కూర్చున్న తరువాత అక్రమాలకు తెరలేపి.. భవన నిర్మాణ అనుమతుల మంజూరులోను, నూతన భవనాలకు పన్నుల విధింపుల్లోనూ అందినకాడికి దోచేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల పాటు జరిగిన అక్రమాలు వెలికి తీసే పనిలో కూటమి ప్రభుత్వం పడింది. పంచాయతీల్లో అక్రమాలపై విచారణ చేసేలా ఓఎస్‌డీ నుంచి మెమో జారీ కావడంతో అక్రమాల్లో దడ మొదలైందన్న చర్చ జరుగుతోంది. స్థానికంగా ఉన్న డీపీఓలు నిక్కచ్చిగా విచారణ చేసి అక్రమాల్లో భాగస్వామ్యులైన వారిపై చర్యలు చేపడతారా..? గాలికి వదిలేస్తారా అన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

పరుగుల దీక్ష

- జాతీయస్థాయి పోటీలకు మడకశిర విద్యార్థిని



మడకశిర టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామమైన గంగులవాయి పాళ్యానికి చెందిన దీక్ష పరుగు పోటీల్లో సత్తాచాటింది. ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. రాజు, రత్నమ్మ దంపతుల పెద్దకుమార్తె దీక్ష మడకశిర కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. గుంటూరు జిల్లా వినుకొండలో సోమవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి 800 మీటర్ల అండర్-17 పరుగు పందెంలో మూడోస్థానంలో నిలిచింది. తద్వారా జాతీయ పోటీలకు ఎంపికైందని పీఈటీ అనిత తెలిపారు. లక్నో వేదికగా త్వరలో నిర్వహించే పోటీల్లో దీక్ష పోటీపడనుంది.

నిరుపేద కుటుంబం

దీక్షది నిరుపేద కుటుంబం. ఎకరా పొలం మాత్రమే ఉంది. తండ్రి రాజు కూలి పనులకు వెళ్తుంటాడు. దీక్ష చెల్లి కూడా మడకశిర కేజీబీవీలోనే ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు, టీచర్ల ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో రాణించానని దీక్ష తెలిపింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేసింది.

టమోటా కిలో రూ.49



అనంతపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.49తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 2025 టన్నుల టమోటా కాయలు వచ్చాయని వివరించారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.27, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయని వెల్లడించారు.

కంది రైతు గుండె జల్లు..!

(5వ పేజీ తరువాయి)

చెందుతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్ల ప్రభావంతో దిగుబడులు చేతికందకుండా పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రొద్దం మండలంలో 20వేల ఎకరాల్లో కందిపంట సాగుచేశారు. గత యేడాది కందిపంట దిగుబడి బాగా వచ్చి రైతులు మంచి ఆదాయం పొందారు. దీంతో ఈసారి ఎక్కువ మంది కంది పంట సాగుచేశారు. జూన్ మాసంలో కందిపంట సాగుచేయగా రెండు నెలలపాటు వర్షాలు కురవలేదు. దీంతో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లేనని అనుకుంటున్న సందర్భంలో రెండుమార్లు బలమైన వర్షం కురిసింది. చీడపీడలు ఆశించడంతో మందును పిచికారి చేశారు. ఆర్. మరువపల్లికి చెందిన తిమ్మారెడ్డి అనే రైతు సాగుచేసిన 15ఎకరాల కందిపంట పూర్తిగా దెబ్బతిందని వాపోయాడు.

మందులు కొట్టి కాపాడుకున్నా..



నాలుగు ఎకరాల్లో కంది పంటను సాగుచేశాను. పంటకు ఒకపక్క తెగుళ్లు, మరోపక్క వర్షాల బెడదతో ఆందోళనగా ఉంది. నెలకిందట వర్షం వచ్చి పూత అంతా రాలిపోయింది. మళ్లీ మందులు కొట్టుకుని పంటను కాపాడుకుంటే మళ్లీ ఇప్పుడు వర్షం కురుస్తుండటంతో భయాందోళనగా ఉంది. తెగుళ్లు అధికంగా పట్టుకున్నాయి.

- చెలిమి ఆంజనేయులు, గరుడంపల్లి, ధర్మవరం మండలం

అప్రమత్తంగా ఉండాలి



బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి రానున్న రెండురోజుల్లో జిల్లాలో అక్కడక్కడా ఓ మోస్తారుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలు కురిస్తే భూమిలో తేమశాతం పెరిగి, చలి తీవ్రతకు కందిపంటపై పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి. పురుగు నివారణకు మందులు పిచికారి చేసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

-రామసుబ్బయ్య, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్, పుట్టపర్తి

వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాలి

- కలెక్టర్ ఆనంద్



ప్రతిభ కనబరచిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వారసత్వ కట్టడాలను ప్రతిఒక్కరూ బాధ్యతగా పరిరక్షించుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పురావస్తు ప్రదర్శన శాలలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమానికి కలెక్టర్ ఆనంద్ హాజరై, మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు నెలకోమారు ఏదో ఒకచోట నిర్వహించాలనీ, తద్వారా పిల్లలు, ప్రజలకు దేశ సంస్కృతి, వారసత్వం గురించి అవగాహన వస్తుందన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, వంటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురావస్తు ప్రదర్శనశాలల శాఖ ఏడీ స్వామినాయక్, ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, డిస్కవర్ అనిల్‌కుమార్, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మనారాయణ రెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్ జయంతి, జిల్లా పర్యాటకశాఖాధికారి జయకుమార్ బాబు పాల్గొన్నారు.

పల్లెలకూ అన్న క్యాంటీన్లు..

(5వ పేజీ తరువాయి)

కష్టకాలంలోనూ జగన్ సర్కారు కాఠిన్యంగా వ్యవహరించింది. 2024లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పేదల ఆకలి విలువ తెలుసుకుని మళ్లీ అన్న క్యాంటీన్లను పునరుద్ధరించింది. ఇన్నాళ్లు నగరాలు, పట్టణాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లను పల్లె పేదల చెంతకు తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఉండే పల్లె ప్రాంతాల్లో సైతం రూరల్ అన్న క్యాంటీన్లు తీసుకొస్తోంది. వాటి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే... ఉమ్మడి జిల్లాలోనే పనులు ఊపందుకున్నాయి.

రూ.61 లక్షలతో నిర్మాణం

నగరాలు, పట్టణాల్లో అన్న క్యాంటీన్లు నిత్యం వేలాది మందికి కమ్మని భోజనాన్ని అందిస్తున్నాయి. గ్రామాల నుంచీ మండల, నియోజకవర్గ కేంద్రాలకు వచ్చే ప్రజలకు కూడా భోజనం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రూరల్ అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 63 రూరల్ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. రాయలసీమ జిల్లాలకు 13 మంజూరు కాగా... ఉమ్మడి అనంతకు 4 కేటాయించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని రాప్తాడు, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, పెనుకొండ ప్రాంతాల్లో రూరల్ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం సుమారు 300 మందికి భోజనం అందించేలా వీటిని నిర్వహించనున్నారు. రూ.61లక్షలతో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

శరవేగంగా పనులు

రాప్తాడు, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, పెనుకొండలో అన్న క్యాంటీన్ల పనులు శరవేగంగా సాగుతున్నారు. రాప్తాడు అన్న క్యాంటీన్ పనులు 90 శాతానికిపై పూర్తయ్యాయి. చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఉరవకొండ, బుక్కరాయసముద్రం, పెనుకొండలో సైతం పూర్తి కావస్తున్నాయి. రాయలసీమ వ్యాప్తంగా చూస్తే జిల్లాలోనే పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తి కాగానే నిత్యం వందలాది మంది పేదల ఆకలి తీర్చనున్నాయి.

డిసెంబరు ఆఖరుకు పూర్తవుతాయి



ఉమ్మడి జిల్లాలో రూరల్ అన్న క్యాంటీన్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రాప్తాడులో 90 శాతానికిపైగా పూర్తయ్యాయి. ఉరవకొండ, పెనుకొండ, బుక్కరాయసముద్రం అన్న క్యాంటీన్ల పనులు సైతం వేగంగా జరుగుతున్నాయి. డిసెంబరు చివరి నాటికి అన్నీ పూర్తవుతాయి. త్వరలోనే పేదలకు అందుబాటులోకి రానున్నాయి.

- రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఈ, పబ్లిక్ హెల్త్, అనంతపురం

ప్రజలకు అందుబాటులో ఉండాలి



పనుల నిమిత్తం నిత్యం పలు ప్రాంతాల నుంచీ నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడుకు ప్రజలు వస్తుంటారు. వారికి అందుబాటులో ఉండాలని అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నాం. చాలా వేగంగా పనులు పూర్తయ్యాయి. ఆస్పత్రి, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ఆటోనగర్‌కు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయించాం. ఎస్ఎస్ గేటులో మరో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

అరటి రైతును ఆదుకోండి

- ప్రభుత్వం పంట కొనుగోలు చేయకపోతే నిరసన
- కలెక్టర్‌తో వైసీపీ నేతలు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అరటి రైతును ఆదుకోవాలని వైసీపీ నాయకులు కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ సమన్వయకర్తలు శైలజానాథ్, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి మంగళవారం కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. జిల్లాలో రైతాంగం పడుతున్న కష్టాలను వివరించారు. ప్రస్తుతం వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఏ సీజన్‌లోనూ ప్రభుత్వం.. రైతులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. అరటి రైతులు గిట్టుబాటు ధర లేక పంటను వదిలేస్తున్నారనీ, పశువులకు మేతగా వేస్తున్నారని చెప్పారు. జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో అరటి సాగయితే 8లక్షల టన్నుల వరకు దిగుబడి వచ్చేదన్నారు. అరటికోతలు ప్రారంభమయ్యాయనీ, గిట్టుబాటు ధర లేదన్నారు. టన్ను రూ.వెయ్యి నుంచి రూ.2వేలు ఉంటే రైతులు బతికేదెలా అని ప్రశ్నించారు. డిసెంబరులో మళ్లీ అరటికోతలు ప్రారంభమవుతాయనీ, తక్షణం ప్రభుత్వమే పంటను కొనుగోలు చేయాలని కోరారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం తప్ప.. రైతులకు ఒనగూరిన ప్రయోజనం శూన్యమన్నారు. రెండు, మూడు రోజుల్లో స్పందించకపోతే అరటి పంటను కలెక్టరేట్ వద్ద ఉంచి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న, సజ్జ, పత్తి తదితర పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.2100 ఉంటే రూ.1500కు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా పప్పుశనగ విత్తనం పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేని దుస్థితి జిల్లాలో నెలకొందన్నారు. సుమారు రూ.2.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందాల్సి ఉందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రైతాంగం తరఫున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

మీ విజయం చరిత్రలో పదిలం

అంధుల మహిళా క్రికెట్ జట్టుకు కర్ణాటక సీఎం అభినందన



దీపికను సన్మానిస్తున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అమరాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అంధుల టీ-20 క్రికెట్ వరల్డ్‌కప్ సాధించిన భారతీయజట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందని, మీ గెలుపు ఎందరికో స్ఫూర్తినిస్తుందని సీఎం సిద్దరామయ్య జట్టు సభ్యులను అభినందించారు. బెంగళూరులోని సీఎం అధికారిక నివాసం 'కృష్ణ'లో మంగళవారం జట్టు సభ్యులందరినీ సీఎం ప్రత్యేకంగా అభినందించారు. జట్టు కెప్టెన్, తుమకూరు జిల్లా శిరాకు చెందిన దీపికా నాయకత్వాన్ని, ఆట నైపుణ్యాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరింత సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కర్ణాటక క్రికెట్ క్రీడాకారులకు తలా రూ.10లక్షల నగదు బహుమతితోపాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జట్టులో ఇతర రాష్ట్రాలనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు తలా రూ.2లక్షల బహుమతిగా ఇస్తామన్నారు. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన 13మంది క్రీడాకారులకు తలా రూ.2లక్షల రివార్డు దక్కనుంది. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, సీఎం మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

జట్టును అభినందించిన విజయేంద్ర

మహిళా క్రికెట్‌జట్టును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రత్యేకంగా అభినందించారు. నగరంలోని చాన్సెరి పెవిలియన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన టీం సభ్యులను అభినందించారు. జట్టును ప్రోత్సహించిన సమర్థనం ట్రస్టు అధ్యక్షుడు, బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ మెంటార్ డాక్టర్ మహంతేశ్‌ను ప్రశంసించారు. ఎంపీ పీసీ మోహన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శరణు తళ్ళికేరి, బెంగళూరు నగర అధ్యక్షుడు సప్తగిరి గౌడ తదితరులు పాల్గొన్నారు.

తిప్పేసిన రాజేష్

ఆరు వికెట్లతో ఒడిశా నడ్డి విరిచిన ఆంధ్రా కెప్టెన్

ఆతిథ్య జట్టు ఘనవిజయం... చివరిరోజు బౌలర్ల హవా



వీరారెడ్డి



రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా కెప్టెన్ రాజేష్ స్పిన్ ఉచ్చులో చిక్కి ఒడిశా బ్యాటర్లు విలవిల్లాడారు. రాజేష్ 45 పరుగులిచ్చి 6 వికెట్లు కూల్చడంతో ఒడిశా రెండో ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే కుప్పకూలింది. ఆతిథ్య ఆంధ్రా జట్టు ఘన విజయం సాధించింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీసీసీఐ కూచ్ బెహర్ క్రికెట్ ట్రోఫీ అండర్-19 క్రికెట్ మ్యాచ్ మూడోరోజైన మంగళవారం ఆంధ్రా బౌలర్లు చెలరేగిపోయారు. ఆంధ్రా జట్టు ఓవర్‌నైట్ స్కోరు 46-2తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 94.2 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 215 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. లోకల్‌బాయ్ వీరారెడ్డి హాఫ్ సెంచరీ (77)తో రాణించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా 94.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌటైంది. ఒడిశా 63.1 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. 374 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒడిశా 54.2 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్రా కెప్టెన్ రాజేష్ 6, ఏఎన్‌వీ లోహిత్ 3 వికెట్లు పడగొట్టారు. దీంతో ఆంధ్రా 253 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

ఆంధ్రా టీ20 జట్టుకు వినయ్‌కుమార్



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సీనియర్ టీ20 జట్టులో జిల్లాకు చెందిన వినయ్‌కుమార్‌కు చోటు దక్కింది. రాష్ట్ర జట్టును మంగళవారం ప్రకటించారు. లక్నోలో ఈనెల 26వతేదీ నుంచి నిర్వహించే బీసీసీఐ సీనియర్ సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆంధ్రా జట్టుకు వినయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.

ధర్మవరం కుర్రాడు అదుర్స్

అంతర్జాతీయ చెస్ టైటిల్ కైవసం



సహృద్‌కి ట్రోఫీ అందజేస్తున్న రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధర్మవరానికి చెందిన సహృద్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో సత్తాచాటాడు. ఏకంగా టైటిల్‌నే కైవసం చేసుకున్నాడు. ఫణికుమార్, దీప్తి దంపతుల కుమారుడైన సహృద్ ఏడో తరగతి చదువుతున్నాడు. విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో 800 మందికిపైగా క్రీడాకారులు పోటీపడ్డారు. అందులో సహృద్ 1800బి రేటింగ్ విభాగంలో 9 రౌండ్లకుగాను ఎనిమిదింటిలో గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నాడు. సహృద్‌ను చీఫ్ కోచ్ ఆదిరత్న కుమార్ అభినందించారు.

హాకీలో అనంత జట్ల సత్తా



బాలికల హాకీ జట్టును అభినందిస్తున్న డీఈఓ, ఏడీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి హాకీ అండర్-14 చాంపియన్‌షిప్‌లో అనంత జట్లు సత్తాచాటాయి. చంద్రగిరిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలుర జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. బాలికల్లో మాన్య, శ్రీలేఖ, ప్రియాంక, బాలురలో ఉదయ్‌కుమార్, విక్కీ రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. నక్కపల్లిలో నిర్వహించిన అండర్-19 హాకీ టోర్నీలో బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. వైష్ణవి, జయశ్రీ బాలికల రాష్ట్ర జట్టుకు, అభిషేక్ బాలుర జట్టుకు ఎంపికయ్యారు. మచిలీపట్నంలో నిర్వహించిన అండర్-14 కబడ్డీ పోటీల్లో అనంత బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. బాలికల్లో భానుశ్రీ, ఆయుష, బాలురలో వన్నూరుస్వామి రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. కర్నూలులో నిర్వహించిన రగ్బీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల్లో లాస్యప్రియ, వీరనారమ్మ, బాలుర జట్టు నుంచి నవదీప్ రాష్ట్ర జట్లలో చోటు దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్‌బాషా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శకుంతల, సుహాసిని, పీడీలు రాగేష్‌బాబు, నాగరాజు, అంజనాబాయి, సునీత పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డిజిటల్ పేమెంట్ చేయండి

● ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డిజిటల్ పేమెంట్ ద్వారా రైతులు నాన్‌సబ్సిడీ డబ్బులు చెల్లించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యవర్తులు, దళారులను నమ్మి డబ్బు చెల్లించరాదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి, మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కల నిజమాయెగా..!

మడకశిర రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం

పెనుకొండలోకి గోరంట్ల, పుట్టపర్తిలోకి అమడగూరు

మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు ఓకే చెప్పిన సీఎం



మడకశిర తహసీల్దార్ కార్యాలయం

పుట్టపర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో మడకశిర ప్రజల చిరకాల వాంఛ.. 'మడకశిర రెవెన్యూ డివిజన్' నెరవేరడం ఖాయమైంది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని మంత్రి వర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులలో మడకశిర రెవెన్యూ డివిజన్‌కు చోటు దక్కింది. దీనిపై అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ క్రమంలో జిల్లాలో అతి పెద్ద రెవెన్యూ డివిజనగా ఉన్న పెనుకొండ నుంచి మడకశిర విడిపోనుంది.

పట్టించుకోని వైసీపీ..

వైసీపీ హయాంలో 2022లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, ప్రజలు ఆందోళన చేశారు. కానీ నాటి ప్రభుత్వం స్పందించలేదు. గోరంట్ల మినహా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకర్గాలను కలిపి పెనుకొండ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో అప్పట్లో మడకశిర ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది ఆగస్టులో సీఎం చంద్రబాబు గుండుమలలో పర్యటించారు. ఆ సమయంలో రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. జిల్లాల పునర్విభజనకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పడాక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ సహా పలువురు టీడీపీ నాయకులు వినతి పత్రాలను సమర్పించారు. ఇలా.. ప్రజల ఆకాంక్ష నెరవేరుతోంది.

ఇవే మార్పులు..

మడకశిర నియోజకవర్గంలోని అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల, మడకశిర మండలాలతో ప్రత్యేక రెవెన్యూ డివిజన్ అవతరిస్తోంది. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోకి చేరుస్తారు. కదిరి రెవెన్యూ డివిజన్‌లోని అమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు. తాజా మార్పులతో పెనుకొండ, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లలో ఆయా నియోజకవర్గాల్లో అన్ని మండలాలు చేరుతాయి. దీనివల్ల పరిపాలనా సౌలభ్యం కలుగుతుంది. పరిపాలన, భౌగోళిక, సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించేలా మార్పులు చేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాప్రమాణాల పెంపు దిశగా..!

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు

1 నుంచి 5 తరగతులకు ఎఫ్ఎల్ఎన్ పేరుతో పరీక్ష

డైట్ విద్యార్థుల సహకారంతో యాప్ ద్వారా టెస్ట్



పెద్దపప్పూరు మండలం జూటూరు ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ పరీక్షను పర్యవేక్షిస్తున్న డైట్ లెక్చరర్లు

అనంతపురం విద్య, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల్లో 60, 70 శాతం మందికి చదవడం, రాయడం రావడంలేదని, కనీసం అంకెలు కూడా గుర్తించలేక పోతున్నారని ఇటీవల కేంద్రం ఓ సంస్థతో నిర్వహించిన సర్వేలో తేలింది. ఆ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కేంద్రం తెచ్చింది. దీంతో ప్రాథమిక స్థాయిలో కూడా విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందుకోసం విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ)పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు.

1427 పాఠశాలలు.. 83,877మంది విద్యార్థులకు పరీక్ష

ఎఫ్ఎల్ఎన్ పేరుతో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులు అక్షరాలను గుర్తించడం, చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు కలిగి ఉండాలి. అలాగే ప్రాథమిక గణిత ప్రక్రియలు, సంఖ్యలను అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు ఏమేరకు ఉన్నాయో తెలుసుకోవడానికి పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలో 135 క్లస్టర్స్ ఉండగా, ఈపరిధిలో 1427 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యాశాఖ రికార్డుల మేరకు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 83,877మంది చదువుతున్నారు. వీరందరికి సోమవారం నుంచి ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు మొదలు పెట్టారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో డీఎడ్ విద్యార్థిని నియమించి వారిద్వారానే ఈపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి పక్షపాతానికి అవకాశం లేకుండా లీప్‌యాప్‌లో రాష్ట్ర స్థాయిలోనే ప్రశ్నాపత్రం రూపొందించి, పొందుపరిచారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులలో ఒక్కోదానికి 16మార్కులకు ప్రశ్నాపత్రం తయారు చేసి పిల్లలను టెస్ట్ చేస్తున్నారు. డీఈఓ ప్రసాద్ బాబు, డైట్ ప్రిన్సిపాల్, డైట్‌లెక్చరర్ల పర్యవేక్షణలో ఈఎఫ్ఎల్ఎన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. సోమ, మంగళవారంలో 129 క్లస్టర్ల పరిధిలో 1797ప్రాథమికపాఠశాలలో 54,681మందివిద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు పూర్తి చేశామని, ఈనెల 28లోగా అందరికీ పరీక్షలు పూర్తి చేస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు

4.250 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, సిబ్బంది

అనంతపురం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఏడుగురు నిందితులను అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచీ 4.25 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్లు, రూ.2700 నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు వివరాలను త్రీటౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. బెళుగుప్పకు చెందిన మనోజ్ కుమార్, అనంతపురంలో ఆరో రోడ్డు ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం బాషా అలియాస్ బబ్లూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. గంజాయి కొనేందుకు సులువుగా డబ్బు సంపాదించాలని హాజీ రహమత్ అలియాస్ కురుగుంట బువ్వమ్మతో పరిచయం పెంచుకున్నారు. ఈ ముగ్గురూ మూడో రోడ్డు ప్రాంతంలో ఉండే రవికుమార్ అలియాస్ పాషి, టీవీ టవర్ ప్రాంతానికి చెందిన ఏలూరు సాలోమన్ అలియాస్ మురళి, తపోవనానికి చెందిన జ్యోతుల ప్రవీణ్‌కుమార్ అలియాస్ లడ్డూ, కళ్యాణదుర్గం బైపాస్ వాసి దినేష్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గంజాయి విక్రయాల ద్వారా వచ్చిన సొమ్ముతో తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే మనోజ్, అస్లాంబాషా, బువ్వమ్మ ఇటీవల విశాఖపట్నం జిల్లా తునికి వెళ్లి.. అక్కడ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద 10 కేజీల గంజాయి కొన్నారు. రైలులో అనంతపురం తీసుకొచ్చారు. అందులో 4 కేజీల గంజాయిని కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి తీసుకెళ్లి కేజీ రూ.18 వేలకు విక్రయించారు. తర్వాత మరో 1.25 కేజీల గంజాయికి 100 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.2 వేలకు అనంతపురం నగర పరిసరాల్లో విక్రయించారు. మిగిలిన 4.25 కేజీల గంజాయిని అమ్ముకోడానికి అనంతపురం నగర పరిసర ప్రాంతమైన రాజీవ్ కాలనీ వద్ద నాగులకట్ట సమీపంలో పంచుకుంటుండగా పోలీసులు అరెస్టుచేశారు. నిందితుల నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు, బైక్, నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా భూములను ఆక్రమించారు..!

ప్రైవేటు కంపెనీ వద్ద రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, నాయకులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెరువు కింద ఉన్న తమ పట్టా భూములను ప్రైవేటు కంపెనీవారు ఆక్రమించారని బాధిత రైతులు ఆందోళనకు దిగారు. కంపెనీ ఎదుట మంగళవారం బైఠాయించారు. బాధితులు తెలిపిన మేరకు, న్యామద్దల చెరువు ఆయకట్టు సర్వే నంబరు 177-1లో నితీష్ కుమార్, ఉమేశ్వరి, ఎర్రమ్మకు 46 సెంట్లు, సర్వేనంబరు 195లో అహోబిళప్పకు 35 సెంట్ల భూమి ఉంది. హనుమే నాయక్‌కు సర్వే నంబరు 177-1లో ఎకరం, సర్వే నంబరు 192లో 30 సెంట్ల భూమి ఉంది. ఈ భూములను తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్నామని రైతులు అంటున్నారు. ఆయకట్టు పరిధిలో ఏర్పాటైన ఓ ప్రైవేటు కంపెనీ తమ భూములను ఆక్రమించిందని వాపోయారు. దీని గురించి ప్రశ్నిస్తే.. న్యాయం చేస్తామని చెబుతూ కంపెనీ ప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. దీంతో సర్వే చేసి తమ భూములను గుర్తించి ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు విన్నవించామని తెలిపారు. సర్వే చేసేందుకు అధికారులు మంగళవారం వచ్చారని, కంపెనీ నిర్వాహకులు వారిని లోనికి అనుమతించలేదని, దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారని అన్నారు. సీపీఐ మండల నాయకుడు ముత్యాలప్పతో కలిసి వారు ఆందోళనకు దిగారు. కంపెనీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, పార్టీ నాయకులు అక్కడికి వెళ్లి విచారించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ల్యాబ్ నిర్వహణపై శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణపై మూడ్రోజులు నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ ఆఫీసర్ బాలమురళి మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లా సైన్స్‌సెంటర్‌లో బుధవారం నుంచి శుక్రవారం వరకు శిక్షణ ఉంటుందన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాలన్నారు.

పాపను తీసుకెళ్లండి

ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి



అనంతపురం వైద్యం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో సంరక్షణ పొందుతున్న 60 రోజుల చిన్నారిని తల్లిదండ్రులు లేదా రక్తసంబంధీకులు తగిన ఆధారాలు సమర్పించి తీసుకెళ్లవచ్చునని ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. రెండు నెలల క్రితం నగరంలోని సాయినగర్ 7వ క్రాస్‌లో నవజాత శిశువును (బాలిక) వదిలేసి వెళ్లిపోయారని తెలిపారు. తాము వైద్య పరీక్షలు చేయించి, శిశుగృహలో సంరక్షిస్తున్నామని తెలిపారు. బాలిక తల్లిదండ్రులు, రక్తసంబంధీకులు 30రోజులలోపు రాకపోతే నిబంధనల మేరకు అనాథగా ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం దత్తత కోరేవారికి చట్టబద్ధంగా దత్తత ఇస్తామని తెలిపారు. వివరాలకు ఐడీసీఎస్ పీడీ కార్యాయాన్ని సంప్రదించాలని కోరారు.

41 దరఖాస్తులు..

మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి(వన్‌స్టాప్) సెంటర్‌లోని పోస్టులకు 41 దరఖాస్తులు వచ్చినట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 25వ తేదీ వరకు ఫిజియో సోషల్ కౌన్సిలర్‌కు ఏడు, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్‌కు 11, సెక్యూరిటీ గార్డ్/ నైట్ వాచ్‌మెన్‌కు 23.. మొత్తం 41 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎంపిక, స్క్రూటినీ తదితర వివరాలు త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)-2026పై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడీటీలు, ఈఎస్‌ఏఎస్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఆర్‌ఓ మలోల మాట్లాడుతూ... 2002 ఓటరు జాబితా ప్రకారం 2025 ఓటర్ లిస్ట్‌లో వారి వారసులతో మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. పెండింగ్ క్లెయిమ్స్ పూర్తి చేయడంపై పలు సూచనలు ఇచ్చారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడీటీలు, ఈఎస్‌ఏఎస్‌లు తమ నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ఎస్ఈగా సంజీవరాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) విభాగం అనంతపురం సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)గా సంజీవరాయుడును నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి క్రిష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌హెచ్ విభాగంలోనే విజయవాడలో ఈఈగా పనిచేస్తున్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో ఈఈ సుధాకర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇయన కూడా నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందుతుండటంతో రెగ్యులర్ ఎస్ఈని నియమించారు.

ఈఈగా సిద్దారెడ్డి..?

సుధాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణతో ఖాళీ పడనున్న ఈఈ స్థానానికి కర్నూలు ఎస్ఈ టూ పీఏగా ఉన్న సిద్దారెడ్డిని నియమించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. గతంలో ఇక్కడ ఆర్‌అండ్‌బీ ఈఈగా పనిచేసిన రాజగోపాల్ సైతం ఎన్‌హెచ్ ఈఈ స్థానం కోసం ప్రయత్నం చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆయననే నియమిస్తారని కూడా చర్చ జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు.. ఆర్ అండ్‌బీలోనే ఉండాలని సూచించడంతో ఆయన ప్రయత్నాలు విరమించుకున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత సిద్దారెడ్డి రాకపై ప్రచారం ఊపందుకుంది. మరో అధికారి కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.

పేలిన పెయింట్ డబ్బా

ఒకరికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్పంగా గాయాలు

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెయింట్ డబ్బా పేలి ఒకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడిన సంఘటన పట్టణంలో మంగళవారం జరిగింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన కమలేశ్, కేతన్‌లాల్ కుటుంబాలతో కలిసి ఆరేళ్ల కిందట ధర్మవరం వచ్చారు. పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయ సమీపంలో రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని షోకేస్‌లో ఉంచుకునే బొమ్మలు తయారు చేసి, విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈక్రమంలో కమలేశ్ మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గుడారం సమీపంలో చెత్తకు నిప్పుపెట్టాడు. అయితే దాని కింద బొమ్మల తయారీకి వాడే పెయింట్ డబ్బా ఉండటం గమనించలేదు. దీంతో వేడికి డబ్బా పేలింది. దీంతో కమలేశ్ అరచేయి ఛిద్రమైంది. కళ్లకు గాయాలు అయ్యాయి. సమీపంలో ఉన్న కేతన్‌లాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న పట్టణానికి చెందిన అశోక్‌కుమార్ కూడా స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వెబ్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, పర్యాటకం, హాస్పిటాలటీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదివినవారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు 9966682246 నంబరులో సంప్రదించాలన్నారు.

జవాబుదారీతనంతో కాంగ్రెస్ నిర్మాణం

ఏఐసీసీ పరిశీలకులు పరమేశ్వర నాయక్



మాట్లాడుతున్న పరమేశ్వర నాయక్

అనంతపురం వైద్యం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బలమైన, జవాబుదారీతనంతో ప్రజలకు అనుసంధానంగా కాంగ్రెస్ పార్టీ నిర్మాణం కావాలని ఏఐసీసీ పరిశీలకుడు పరమేశ్వర నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీసీసీ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పరమేశ్వర నాయక్ మాట్లాడుతూ పార్టీ పునర్నిర్మాణం చేయడానికి సంఘటన్ సృజన్ అభియాన్(ఎస్ఎస్ఏ)ను రాహుల్ గాంధీ చేపట్టారన్నారు. భారత్ జోడో, భారత్ జోడో న్యాయ్ యాత్ర స్ఫూర్తితో కాంగ్రెస్ సిద్ధాంతాల్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ పరిశీలకులు అల్లాబకాష్, మహమ్మద్, అలీఖాన్, అంబటి రామకృష్ణయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

వైసీపీలో భగ్గుమన్న వర్గపోరు

కుర్చీలతో దాడులకు యత్నం



కుర్చీలతో దాడి చేసుకుంటున్న ఇరువర్గాలు

మడకశిరటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గ వైసీపీలో వర్గపోరు భగ్గుమంది. పట్టణంలో మంగళవారం జరిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో రెండు వర్గాల నాయకులు పరస్పరం దాడులకు యత్నించారు. గత నెలలో రొళ్ల ఎంపీపీపై సొంత పార్టీలోనే ఒక వర్గానికి చెందిన నాయకులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అధిష్టానం వద్దన్నా పంతం పట్టి అవిశ్వాసాన్ని నెగ్గించారు. దీంతో రొళ్లలో వైసీపీకి చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ తమ పదవులు కోల్పోయారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. మంగళవారం మడకశిరలో వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశం జరుగుతుండగా రొళ్ల ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై చర్చ లేపారు. ఒక వర్గానికి చెందిన వారు టీడీపీలోకి వెళ్లాలని ప్రోత్సహించారంటూ ఆరోపణలు చేసుకోసాగారు. ఈసమయంలోనే వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్పకు రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. ఈక్రమంలో ఇరువర్గాల వారు చెయిర్‌లు తీసుకుని దాడులకు దిగారు. దీంతో అక్కడ ఉన్న కొందరు నాయకులు సర్దిచెప్పి సమావేశాన్ని కొనసాగించారు. వైసీపీలో నెలకొన్న ఈ వర్గపోరు భరించలేక అనేకమంది తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారు.

న్యూస్ బాక్స్

లే అవుట్ల క్రమద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లు, నిర్మాణాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించందని, ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు గడువును 2026 జనవరి వరకు పొడిగించిందని తెలిపారు. అదేవిధంగా ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి 2026, మార్చి 12 వరకు అవకాశం ఉందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

తాడిమర్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో గత ఏడాది కాలంలో జరిగిన ఉపాధి హామీ పనులను, అందుకు గాను జరిగిన చెల్లింపులను పరిశీలించేందుకు బుధవారం నుంచి సామాజిక తనిఖీ ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరంగారావు తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ శాఖల అధికా రులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించా రు. సామాజిక తనిఖీలో మూడు బృందాలు పాల్గొంటాయని తెలిపారు.

దోమల నివారణపై అవగాహన

తాడిమర్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దోమలు పుట్టకుండ, కుట్టకుండ జాగ్రత్తలు వహించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్ పేర్కొన్నారు. మండలంలోని మరువపల్లిని ఆయన మంగళవారం సందర్శించి దోమణ నివారణ, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి రికార్డులు తనిఖీచేశారు. హెల్త్ సూపర్ వైజర్ రాంకుమార్, హెల్త్ అసిస్టెంట్ హర్షవర్ధన్, సీహెచ్ఓ పావని, ఏఎన్ఎం చంద్రావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భర్త, అత్త వేధిస్తున్నారని ఫిర్యాదు

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తనను భర్త, అత్త, ఆడ ఎడచులు వేధిస్తున్నారని పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కవిత మంగళవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. శాంతినగర్‌కు చెందిన కవితకు బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన చంద్రశేఖర్‌తో ఐదేళ్ల క్రితం ఇచ్చి వివాహమైంది. వారికి నాలుగేళ్ల కుమారుడు ధన్విన్ ఉన్నాడు. చంద్రశేఖర్ అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాల లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. వివాహమైనప్పటి నుంచి భర్త చంద్రశే ఖర్, అత్త రత్నమ్మ, ఆడపడచులు రాధ, అనిత తరచూ వేధింపు లకు గురిస్తున్నారు. ఈ విషయంపై కవిత తల్లిదండ్రులు పెద్దల స మక్షంలో పంచాయతీ చేసినా వారిలో మార్పు రాలేదు. చంద్రశేఖర్ పట్టించుకోకపోడంతో రెండేళ్ల క్రితం కవిత శాంతినగర్‌లోని పుట్టిం టికి వచ్చింది. స్థానికంగా శ్రీనివాసస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం భర్త, అత్త, ఆడపడ చులు విడాకులు ఇవ్వాలని గొడవపడి ఇష్టానుసారం తిడుతూ దాడిచేశారు. కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

బొలెరో వాహనం బోల్తా - ఒకరికి గాయాలు


బోల్తాపడిన వాహనం

నల్లచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై బొలెరో వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో ఒక్కరు గాయపడ్డారు. కదిరికి చెందిన బొలెరో డ్రైవర్ శివ మరో వ్యక్తి శ్రీనివాసులు తమ బొలెరో వాహనంలో నల్లచెరువు నుంచి సెంట్రింగ్ రేకులను లోడ్ చేసుకొని తిరిగి కదిరికి వెళ్తున్నారు. పాత స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో రేకులపై కూర్చున్న శ్రీనివాసులు ఒక్కసారిగా రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సిమెంట్ లారీ బోల్తా పడి ముగ్గురికి...


బోల్తాపడిన సిమెంటు లారీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరయ్య కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం సిమెంట్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ భాస్కర్, అతడి భార్య సుకన్యకు స్వల్ప గాయాలుకాగా లారీ క్లీనర్ వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రొద్దుటూరు నుంచి సిమెంట్ లోడ్‌తో బెంగళూరుకు వెళ్తున్న లారీ సుందరయ్య కాలనీ హైవే వద్దకు రాగానే కుక్క అడ్డురావడంతో డ్రైవర్ ఉన్నపలంగా బ్రేక్ వేశాడు. దీంతో లారీ అదుపుతప్పి బోల్తా పడినట్లు బాధితులు తెలిపారు. గాయపడ్డవారిని 108 అంబులెన్స్ వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు...

తనకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లి సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదంలో కదిరికి చెందిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే ద్విచక్ర వాహనంలో కదిరికి చెందిన మోహన్‌క్రిష్ణ, లోకేష్, తేజ కలిసి అన్నమయ్యజిల్లాలోని మొలకలచెరువు వైపు వెళ్తున్నారు. తనకల్లు మండలంలోని మండ్లిపల్లి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో మోహన్‌క్రిష్ణ, తేజ తీవ్రంగా గాయపడగా, లోకేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వందేమాతరం టీమ్ వారి అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సకాలంలో ఇంటి పన్ను చెల్లించండి

ఓబుళదేవరచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీఓ అంజినప్ప, గ్రామ కార్యదర్శి శంకరప్ప, సర్పంచ్ గోవిందు కోరారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ సకాలంలో ఇంటి పన్నులను చెల్లించాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు

నల్లచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేసిన కారణంగా నల్లచెరువు బస్టాండ్ కూడలిలో మండలంలోని ముస్లిం మత పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు వాదలపల్లి అబ్దుల్‌ఖాదర్, దాదం శివారెడ్డి, బార్ బషీర్‌అహ్మద్, మానుసాబ్, మహబూబ్ బాషా, ప్రభుత్వ ఖాజీలు అన్వర్, అమీర్ ఖాన్, మండలంలోని మసీదుల ఇమామ్‌లు, మౌజన్‌లు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ఇష్టారాజ్యం

● వార్డు సచివాలయంలో అందుబాటులో ఉండని వైనం
● ప్రజలకు తప్పని ఇబ్బందులు


మధ్యాహ్నం 2 గంటల తరువాత అడ్మిన్ సాయికుమార్ ఒక్కరే..

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్థసారథి నగర్-2లోని 25 వార్డు సచివాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. సిబ్బంది వార్డు సచివాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ప్రస్తుతం స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలనే ఆసక్తి ఉన్న వారు.... ఇంటి మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెలాఖరు వరకు గడువు పెట్టింది. దీంతో ప్రజలు గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వస్తే ఒక్క అడ్మిన్, డేటాఎంట్రీ ఆపరేటర్ తప్ప మిగిలిన వారు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వారు ఎప్పు డు వస్తారో ఎప్పుడు వెళ్తారోనని వాపోతున్నారు. పార్థసారథి నగర్-2 సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటల పైన అడ్మిన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్ప మిగిలిన సిబ్బంది అంతా ఇళ్లకు వెళ్లిపోయారు. మళ్లీ ఎవరూ తిరిగి రాలేదు. ఇక్కడ రోజూ పరిస్థితి ఇలానే ఉంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం రావడం గంట సేపు కాలయాపన చేయడం ఆ తరువాత ఏదో పని ఉందం టూ సచివాలయం నుంచి వెళ్లిపోతున్నారని పలువురు ప్రజలు పేర్కొ న్నారు. ఇదివరకే ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళ్లినా, సంబంధిత సిబ్బంది సక్రమంగా రాకపోవడంతో హౌసింగ్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చిందని స్థానికులు పేర్కొంటు న్నారు. సచివాలయాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి సచివాలయంలో సిబ్బంది సాయంత్రం వరకు ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పార్థసారథినగర్-2 25వ వార్డు సచివాలయంలో మధ్యాహ్నం 2గంటలకే ఇళ్లకు వెళ్లిపోయారన్న విషయం నా దృష్టికి రాలేదు. సచివాలయాన్ని తనిఖీ చేసి విచారిస్తాం మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లి, తిరిగి రానట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. -సాయికృష్ణ, ఇన్‌చార్జ్ కమిషనర్

హింసను నివారించాల్సిన బాధ్యత అందరిదీ..

● న్యాయాధికారులు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో హింసా చర్యలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి హరీశ్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు హాలులో మంగళవారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మహిళలపై హింస అనేది మానవహక్కుల ఉల్లంఘన అని అందరూ తెలుసుకోవాలన్నారు. మహిళలు, బాలికలపై జరిగే దాడులు, లైంగిక వేధింపులను నివారించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలసుందరి, సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీలపై హింసను నియంత్రించాలి

● ఐసీడీఎస్ పీఓ రాధిక

కదిరి లీగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి రాధిక పేర్కొన్నారు. అంతర్జాతీయ స్త్రీహింస వ్యతిరేక దినం సందర్భంగా మండల న్యాయ అధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అలాగే న్యాయవాది లోకేశ్వర్ రెడ్డి, లోక్‌ఆదాలత్ నుంచి ఎల్ఎన్ శారద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హింస ఏ రూపంలో ఎదురైనా భరించాల్సి నలిగి పోవాల్సి, అవసరం లేదని మహిళలు గుర్తుంచుకోవాలన్నారు. అందుకు తగిన చట్టాలను తెలుసుకొని వాటిని సద్వినియోగపరుచుకోవాలన్నారు. హింస లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కంకణం బద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

సిరిగారిపల్లికి బస్సు ... గ్రామస్థుల హర్షం

ముదిగుబ్బ, నవంబరు, 25(ఆంధ్రజ్యోతి): కదిరి - మల్లేపల్లి బస్సును సిరిగారిపల్లికి అనుసంధానం చేస్తూ మంగళవారం పునరుద్ధరించారు. బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని సిరిగారిపల్లి గ్రామ ప్రజలు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి కదిరి ఆర్టీసీ డిపో అధికారులతో చర్చించి, సిరిగారిపల్లికి బస్సు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మంగళవారం సిరిగారిపల్లికి బస్సు వెళ్లడంతో విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు, మహిళలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బస్సు డ్రైవర్, కండక్టర్‌కు గ్రామస్థులు శాలువాలు కప్పి సన్మానం చేశారు. అనంతరం మంత్రి సత్యకుమార్, కూటమి ప్రభుత్వానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

డైట్ కళాశాలకు ఇన్వర్టర్ వితరణ


రిటైర్డ్ ప్రిన్సిపాల్ మునెయ్య చేతుల మీదుగా ఇన్వర్టర్ అందజేస్తున్న దృశ్యం

బుక్కపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలకు అవసరాల నిమిత్తం రూ.లక్ష విలువ చేసే ఇన్వర్టర్‌ను 2010-12 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ తాము రెండు సంవత్సరాల శిక్షణ కాలంలో విలువలతో కూడిన శిక్షణ అభ్యసించి, ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నామని తెలిపారు. పూర్వ విద్యార్థులను స్థానికులు, విద్యార్థులు, స్థానికులు అభినందించారు. పూర్వ విద్యార్థులందరూ రిటైర్డ్ మునెయ్య చేతులమీదుగా బుక్కపట్నం ఎంఈఓ మోహన్ బాబు, ప్రస్తుత సీని యర్ లెక్చరర్ రామక్రిష్ణకు డైట్ కళాశాలకు ఇన్వర్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 2010-12 బ్యాచ్ విద్యార్థులు మంజునాథ్, మానస, రామాంజినేయులు, జయలలిత, రేవతి, బాలాజి, భాగ్యలక్ష్మి, నాగేంద్ర, హర్షలత పాల్గొన్నారు.

పోలీసులు సహకరించాలి: న్యాయాధికారులు


మాట్లాడుతున్న న్యాయాధికారులు లోకనాథం, జయలక్ష్మి

కదిరి లీగల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్‌ఆదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీసులు సహకరించాలని మండల న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్, న్యాయాధికారి జయలక్ష్మి, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధి కారి లోకనాథం పేర్కొన్నారు. కదిరి ప్రాంతంలోని పోలీస్ అధికారులతో మంగళవారం కోర్టు ఆవరణలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ... ప్రజా న్యాయస్థానాలు విజయవంతం కావాలంటే పోలీసులు సహకారం ఎంతైనా అవసరమన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి పెద్ద సంఖ్యలో కేసులను తీసుకురావాలని సూచించారు. సీఐలు నారాయణ రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవాతో నీటి సమస్యకు పరిష్కారం

● శ్రీరామ్ చొరవతో శాశ్వత పరిష్కారానికి అడుగులు
● టీడీపీ నాయకుడు మహేష్‌చౌదరి


రైతన్నా... మీ కోసం కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు

ధర్మవరం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ప్రత్యేక చొరవ తీసుకుని హెచ్ఎన్ఎస్, పీఏబీఆర్ అధికారులతో సమావేశం నిర్వహించారని టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మహేష్ చౌదరి పేర్కొన్నారు. దీంతో నియోజకవర్గంలో హంద్రీనీవా ద్వారా నీటిసమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి ముంద డు గు పడుతోందని టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్ చౌదరి అన్నారు. మండలంలోని పోతుకుంట గ్రామంలో మంగళవారం 'రైతన్నా... మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా, టీడీపీ నాయకులు హాజరయ్యారు. ముందుగా రైతుల ఇళ్లవద్దకు వెళ్లి కరపత్రాలు అందించి ప్రభుత్వం రైతులకు అందించిన పథకాలు, పంచ సూత్రాలపై వివరించారు. అనంతరం రైతుసేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్‌చౌదరి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో చెరువులను హంద్రీనీవా జలాలతో నింపేందుకు పరిటాలశ్రీరామ్ ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే నీరు వచ్చేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. టీడీపీ నాయకులు గొట్లూరు శ్రీనివాసులు, విజయసారథి, సింగల్‌విండో సొసైటీ అధ్యక్షుడు మేకల రామాంజినేయులు, పోతుకుంట రవి, తలారి వెంకటలక్ష్మి, విజయ్ చౌదరి, కొండారెడ్డి, భాస్కర్‌చౌదరి, రమేష్, జంగంనరసింహులు, మల్లేనిపల్లి చంద్ర, నారాయణస్వామి, గవ్వల రామాంజినేయులు పాల్గొన్నారు.

పచ్చదనం-పరిశుభ్రతపై శిక్షణ

కదరి అర్బన్, నవంబరు 25(ఆంధ్రజోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ పోల్బ అధ్యక్షతన పచ్చదనం-పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, నీటి శుద్ధి, గ్రామాలలో పచ్చదనం పెంపుపై సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామాన్ని చెత్తలేని హరిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సూచించారు. మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● బత్తలపలి:మండలంలోని ప్రతి పల్లెను పరిశుభ్రంగా ఉంచి పచ్చదనాన్ని పెంపొదిద్దామని ఎంపీడీఓ నరసింహనాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పరిశుభ్రత, పచ్చదనం థీం - 5పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కిష్టప్ప, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణపై అనాసక్తి

● మధ్యాహ్నం హాజరుకాని సర్పంచులు, ఉప సర్పంచులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఎల్ఎస్‌డీజీ థీమ్-5 కింద గ్రామ కార్యదర్శులతో పాటు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ అంజినప్ప హాజరై శిక్షణ ఇచ్చారు. ఉదయం శిక్షణ ప్రారంభంలో పంచాయతీ కార్యాదర్శులతో పాటు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు. మధ్యాహ్నం శిక్షణ తరగతుల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొనకపో వడంతో కేవలం గ్రామ కార్యదర్శులకే అధికారులు స్వచ్ఛతపై శిక్షణ ఇవ్వాల్సి వచ్చింది. జరగబోవు రెండో రోజు శిక్షణ కార్యక్రమంలోనైనా అజెండాలో పొందుపరిచిన వారందరూ హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ అంజినప్పను వివరణ కోరగా.. ఉదయం శిక్షణ తరగతులకు పంచాయతీ కార్యదర్శులతో సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారని తెలిపారు. మధ్యాహ్నం కూడా అందరూ హాజర కావాలని కోరామన్నారు. మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులతో పాటు వెంకటాపురం సర్పంచు శంకర్ రెడ్డి తప్ప ఎవరూ రాలేదన్నారు. వారికే శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు.


శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ అంజినప్ప


మధ్యాహ్నం కార్యదర్శులు మాత్రమే హాజరైన దృశ్యం

కుమ్మరవాండ్లపల్లిలో రైతన్నా... మీ కోసం


రైతులకు వివరిస్తున్న ఏఓ లక్ష్మీప్రియ, కూటమి నాయకులు

నల్లచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓరువాయి పంచాయతీ కుమ్మరవాండ్లపల్లిలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రియ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా... మీ కోసం' కార్యక్రమం నిర్వ హించారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓతో పాటు ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, వీఆర్ఓ నిర్మల, టీడీపీ నాయకులు సతీష్ చౌదరి, సీనియర్ నాయకులు దేవేంద్ర గౌడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


బండవాండ్లపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సనావుల్లా

నల్లమాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బండవాండ్లపల్లిలో మంగళవారం ఏడీఏ సనావుల్లా ఆధ్వర్యంలో 'రైతన్నా... మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లాభసాటి పంటలు సాగుచేసి, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తదితర ప్రభుత్వ పథకాలపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏఓ అబ్దుల్‌హక్, ఏఈఓ రంగాచారి, రైతు సేవాకేంద్రం సిబ్బంది శిరీషా, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

● ఎస్టీయూ నాయకులు

కదిరి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరి ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల విద్యాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల సమ స్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కేజీబీవీ ఉద్యో గులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారు కొన్ని దశాబ్దాలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవి నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి: డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండి పల్లెల్లో ప్రశాంత జీవనం గడపాలని డీఎస్పీ విజయ్ కుమార్ కంబాలపర్తి గ్రామస్థులకు సూచించారు. పిల్లల భవిష్యత్తులో తల్లితండ్రులు కీలకపాత్ర వహించాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలమేరకు మంగళవారం రాత్రి మండలపరిధిలోని కంబాలపర్తిలో వారధి కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ... మహిళలు, బాలికలపై జరిగే నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, సైబర్‌సేఫ్టీ, రోడ్డుప్రమాదాలు, డ్రంకెన్ డ్రైవ్, బాల్యవివాహాలు, ఫోక్సో తదితర విషయాలపై ప్రజలకు తెలియజేశారు. ఫ్యాక్షన్ గొడవలకు వెళ్లకుండా పల్లెల్లో ప్రశాంత జీవనం గడిపాలని, పిల్లలను బాగా చదివించాలని సూచించారు. శక్తియాప్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ లింగన్న, పోలీసు సిబ్బం ది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

కదిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రూరల్ డెవలప్‌మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్‌పర్సన్ మన్సూర్ మాట్లాడుతూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి మండలం నుంచి 109 మంది కంటి పరీక్షలకు రాగా, అందులో 34 మందిని ఆపరేషన్ కోసం కడప పుష్పగిరి ఆసుపత్రికి పంపామని తెలిపారు. 50 మందికి కళ్ల అద్దాలు అందించామన్నారు. వైద్యాధికారి అశ్రిత, పుష్పగిరి ఆసుపత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలను పెంచండి : ఏపీడీ

గాండ్లపెంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల కూలీల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధి హామీ సిబ్బందికి ఏపీడీ శకుంతలమ్మ మంగళవారం సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏపీడీ సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో ఉపాధి హామీ కూలీల శాతం తగ్గిందని, ప్రతి పంచాయతీలో వంద మందికి తగ్గకుండా పనులు కల్పించాలని సూచించారు. అలాగే ఈకేవైపీ చేయించుకోని కూలీలకు ఈకేవైసీ చేయించాలని, గృహ నిర్మాణ లబ్దిదా రులకు జాబ్‌కార్డులు అందించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు


ఎంపికైన క్రీడాకారులతో బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు ఉమ్మడి అనంత జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. అనంతపురంలో గతనెలలో ఇండోర్‌స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో... ధర్మవరానికి చెందిన విజయ్‌తరుణ్, సాయికుమార్, బాలికల విభాగంలో... యశస్విని, అలేఖ్య ఎంపికైనట్లు తెలిపారు. వారు బుధవారం నుంచి ఈ నెల 28వతేదీ వరకు విజయవాడలోజరిగే 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ అండర్-19 రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు.ఎంపికైన క్రీడాకారులను శెట్టిపి జయచంద్రారెడ్డితోపాటు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


గెలుపొందిన విద్యార్థినులతో హెచ్ఎం

ధర్మవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట రైల్వే బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ తెలిపారు. పాఠశాలలో 8,9 తరగతులు చదువుతున్న నాగప్రణీత, కల్యాణి, ఉషశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. వారిని మానవతా సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్‌లు, జ్ఞాపికలతో సత్కరించారు. మానవతా సేవా సంస్థ ఛైర్మన్ నారాయణమూర్తి, అధ్యక్షుడు జగ్గా వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు మంజునాథ్, అకడమిక్ డైరెక్టర్ రామకృష్ణ, ఆత్మీయ సలహాదారులు మనోహర్‌గుప్త పాల్గొన్నారు.

గంధం ఉత్సవానికి రండి

మంత్రిని ఆహ్వానించిన తాజ్‌బాబా



మంత్రిని ఆహ్వానిస్తున్న తాజ్‌బాబా

పెనుకొండ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన హజరత్ బాబాఫకృద్దీన్ 753 ఉరుసు ఉత్సవానికి మంగళవారం మంత్రి నివాసంలో తాజ్‌బాబా మంత్రి సవితకు ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జరిగే బాబాయ్యస్వామి గంధం ఉరుసుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు దాదు, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలించకుండానే విమర్శలా..?

- టీడీపీ నాయకులు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నారనాగేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగులు, రాళ్లు, ఇనుప ముక్కలున్నాయంటూ వైసీపీ రాజకీయం చేసిందని టీడీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం రొద్దం మండల పరిధిలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను టీడీపీ నాయకులు, ఎంఈఓ అరవింద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ నాయకులు పాఠశాల విద్యార్థులపై రాజకీయం చేయడం దారుణమన్నారు. పాఠశాలలోకి వెళ్లకుండా భోజనాన్ని పరిశీలించకుండానే భోజనం బాగాలేదని విమర్శించడం బాధాకరమన్నారు. పాఠశాలలోకి వచ్చి భోజనాన్ని పరిశీలించి తరువాత మాట్లాడాలని హితవుపలికారు. ఇలాంటి రాజకీయాలు చేయడం మంచిదికాదని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మనోహర్, నాగభూషణం, లింగప్ప, గోవిందప్ప, ధనుంజయ, లోకేష్, మహేష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఎస్పీపై చర్యలు తీసుకోండి

ఆలిండియా పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల డిమాండ్



నిరసన తెలుపుతున్న నాయకులు

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్న హిందూపురం తపాలా శాఖ ఎస్పీపై చర్యలు తీసుకోవాలని మంగళవారం హెడ్‌పోస్టాఫీసువద్ద నిరసన తెలిపారు. ఆల్‌ఇండియా పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని తపాలాశాఖలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు హాజరయ్యారు. నిరసనకు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగా డివిజన్‌లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులపై కక్షగట్టారన్నారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎలక్ట్రిక్ వాహనాలతో చెత్త సేకరణ

మున్సిపల్ చైర్మన్ రమేష్



డ్రైవర్లకు వాహన తాళాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇక నుంచి ఎలక్ట్రికల్ వాహనాలతో చెత్తసేకరణ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంవద్ద చెత్తసేకరణ కోసం ఎలక్ట్రికల్ వాహనాలను డ్రైవర్లకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహనాల ద్వారా డంపింగ్‌యార్డ్‌కు చెత్తను తరలిస్తారన్నారు. దీనివల్ల మునిసిపాలిటీకి ఖర్చు తగ్గుతుందన్నారు. భవిష్యత్తులో అన్నీ ఎలక్ట్రికల్ వాహనాలే ఉంటాయన్నారు. 15వ ఆర్థిక సంవత్సరం నిధుల ద్వారా తొమ్మిది ఎలక్ట్రికల్ వాహనాలు టెండర్ల ప్రక్రియ ద్వారా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇందులో మూడు వాహనాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంఈ దస్తగిరి, డీఈ లోకేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గోరంట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పుట్టపర్తి రహదారిలో గుంతపల్లి వద్ద ద్విచక్రవాహనం బోల్తాపడి దంపతులు భాను, ఇమ్రాన్ తీవ్రంగా గాయపడ్డారు. హిందూపురం పట్టణంలోని రహమంత్‌పూర్‌కు చెందిన వీరు ద్విచక్రవాహనంపై పుట్టపర్తి ఆసుపత్రికి వెళ్లి, చికిత్స అనంతరం తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వాహనానికి గుంతపల్లి వద్ద కుక్క అడ్డురావడంతో బోల్తాపడ్డారు. భర్త ఇమ్రాన్ చేయి విరగగా భాను స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు పుస్తకాలు

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో చదివే విద్యార్థులకు రూ.లక్ష విలువచేసే పుస్తకాలను సువర్ణభారతి విద్యాసంస్థలు అందించారు. విద్యాసంస్థల అధినేత నీలకంఠారెడ్డి, ఏఓ అనీల్‌కుమార్ అధ్యాపకులు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ అనురాధకు అందించారు.



ప్రిన్సిపాల్‌కు పుస్తకాలు అప్పగిస్తున్న ఏఓ అనిల్‌కుమార్

భవనాల క్రమబద్ధీకరణకు ఆఖరి చాన్స్

- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా అనుమతిలేని కట్టడాలు
- పురంలో 600కు పైగా..



హిందూపురం మున్సిపల్ కార్యాలయం

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం ఆఖరి అవకాశం ఇచ్చిందని చెప్పవచ్చు. డబ్బు చెల్లించి రెగ్యులర్ చేసుకుంటే ఆ నిర్మాణాలకు అన్నిరకాల అనుమతులు వచ్చే స్తాయి. ప్రభుత్వం ఇలాంటివాటికోసం బీపీఎస్ తీసుకొచ్చింది. ఇవి అనుమతిలేని భవనాల క్రమబద్ధీకరణకు సువర్ణ అవకాశంగా చెప్పవచ్చు. పురపాలక సంఘాల పరిధిలో అక్రమ కట్టడాలు క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2019లో దరఖాస్తుల స్వీకరణతోనే ప్రక్రియ ఆగిపోయింది. ఆరేళ్ల తరువాత బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్) కింద సరిచేసుకోవడానికి అవకాశం కల్పించింది.

మునిసిపాలిటీ పరిధిలో నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఇలా ఏది నిర్మించాలన్నా టౌన్‌ప్లానింగ్ అనుమతులు తప్పనిసరి. ప్లానింగ్‌మేరకు నిర్మాణాలు చేపట్టి నివాసాలచుట్టూ సెట్‌బ్యాంక్, కమర్షియల్, అపార్ట్‌మెంట్లకు సెల్లార్, ఇతరత్ర నిబంధనల మేరకు నిర్మాణాలు సాగించాల్సి ఉంది. అయితే కొంతమంది భవన యజమానులు బిల్డర్లు డబ్బులు ఆదాచేసుకునేందుకు అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. జీ ప్లస్ టు అనుమతి తీసుకుని జీ4, జీ5 నిర్మాణాలు చేపడుతూ పార్కింగ్ కోసం సెల్లార్‌షీల్డ్, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. పేపర్‌లేకుండా ప్లాన్‌లో మాత్రం అన్ని చూపిస్తున్నారు. నిర్మాణాల్లో మాత్రం భారీ వ్యత్యాసాలుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే కొంతమంది తెలియక అపార్ట్‌మెంట్లు కొనుగోలుచేసి వాణిజ్య భవనాల్లో షాపింగ్‌మాల్ నిర్వహిస్తున్నారు. అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాల్లోకి మంటలు ఆర్పేందుకు ఫైరింజన్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. దీనివల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరుగుతున్నాయి. అలాంటి వాటికి కూటమి ప్రభుత్వం సువర్ణవకాశం ఇచ్చిందని చెప్పవచ్చు. 1985జనవరి1 నుంచి 2025ఆగస్టు31లోపు నిర్మించిన భవనాల యజమానులకు ఇది వర్తిస్తుంది.

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా కట్టడాలు

వైసీపీ హయాంలో చాలా మంది మేమేంటి అనుమతి తీసుకునేది అన్నట్లు ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగించారు. ఇలాంటి నిర్మాణాలు హిందూపురంలో 945 ఉండగా అందులో ప్రభుత్వం ఇచ్చిన సడలింపుతో ఇంకా 600కుపైగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది. గత వైసీపీ హయాంలో చాలా మంది పార్టీ నాయకులు మున్సిపల్ ఆదాయానికి గండికొడుతూ భవనాన్ని నిర్మిస్తున్న యజమానులవద్దకు వెళ్లి మున్సిపల్ అనుమతులు అవసరం లేదని మేం చెబితే చాలంటూ కొంతమొత్తం వసూలుచేసి నిర్మాణాలు కట్టించారు. కళ్లముందే అక్రమ కట్టడాలు జరుగుతున్నా పట్టించుకోలేని పరిస్థితుల్లో అధికారులు ఉండిపోయారు. అయితే కూటమి ప్రభుత్వం అలాంటి వారికి బీపీఎస్ రూపంలో అవకాశం ఇచ్చింది. 2026మార్చి12వరకు దరఖాస్తుకు అవకాశం ఇచ్చింది. అయితే వైసీపీ హయాంలో ఐదేళ్లకాలంలో బీపీఎస్ స్కీం తీసుకురాలేదు. ఆయా ప్రాంతాల్లో మార్కెట్ విలువ ప్రకాశం ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఆ దిశగా అధికారులు చొరవ చూపకపోవడం విడ్డూరంగా ఉంది.

రెగ్యులర్ చేసుకుంటే రూ.50కోట్లకుపైగా ఆదాయం

జిల్లాలో హిందూపురంతోపాటు మడకశిర, పెనుకొండ, కదిరి, పుట్టపర్తి, ధర్మవరంలో సుమారు 3వేలకుపైగా అక్రమ కట్టడాలున్నాయి. వీటన్నింటిని క్రమబద్ధీకరించుకుంటే ప్రభుత్వానికి రూ.50కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఒక్క హిందూపురంలోనే రూ.10కోట్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



భవనాలను క్రమబద్ధీకరించుకుని యజమానులు బీపీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్తులో ఆ భవనాల అమ్మకాలు, కొనుగోలుకు అవకాశం ఉంటుంది. బ్యాంకుల నుంచి రుణాలు సులువుగా పొందవచ్చు. దీనిపై సచివాలయ వారిగా అవగాహన కల్పిస్తున్నాం. దీనిని పట్టణంలో అనుమతులేకుండా భవనాలు నిర్మించుకున్న యజమానులు ముందుకురావాలి.

-మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



కొడికొండ చెక్‌పోస్టు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న నాగముద్దయ్య

చిలమత్తూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. ఆయన మంగళవారం కొడికొండ చెక్‌పోస్టులోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా తరలివచ్చే మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను రాష్ట్రంలోకి నిషేధిత పదార్థాలు రాకూడదన్నారు. 44వ జాతీయ రహదారి కావడంతో నిరంతరంగా వాహనాల రాకపోకలు ఉంటాయని, అనుమానాస్పద వాహనాలను తనిఖీ తనిఖీ చేయాలన్నారు. వాహనాల తనిఖీ అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. వాహనాల తనిఖీతో నిషేధిత పదార్థాల రవాణాను పూర్తి స్థాయిలో అడ్డుకోవచ్చన్నారు. అనంతరం ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీరామ్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఉన్నారు.

● **పెనుకొండ:** మద్యం దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే అధికంగా అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను నాగమద్దయ్యతోపాటు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీరామ్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలురికార్డులు పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ కర్నాటక మద్యం అమ్మకాలు, రవాణాను అరికట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ సృజన్‌బాబు, ఎస్‌ఐలు రాముడు, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'గెలుపే ధ్యేయంగా పనిచేయాలి'

సోమందేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని టీడీపీ నాయకులు భానుకీర్తిస్వామి తెలిపారు. మంగళవారం చాలకూరు గ్రామంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిల గ్రామ కమిటీ సభ్యులు బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పదవులు చేపట్టిన నాయకులు, కార్యకర్తలు వాటికి వన్నెతెచ్చేవిధంగా పనిచేయాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు సమర్థవంతంగా చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని న్యాయవాదులు పేర్కొన్నారు. మంగళవారం ప్రైవేట్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు సుదర్శన్, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే చట్టాలపై అవగాహన కలిగిఉంటే నేరాల జోలికి వెళ్లరన్నారు. మనిషి పుట్టుక నుంచి మరణించేవరకు ప్రతి అంశం చట్టంతో ముడిపడి ఉందన్నారు. 18ఏళ్లలోపు వారు వాహనాలు నడపడానికి వీలులేదన్నారు. ప్రమాదాలు జరిగితే ఆ వాహన యజమానిపై లేదా వారి వాహనం నడిపే బాలుడి తల్లిదండ్రులపై కేసు నమోదవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్, న్యాయవాదులు రవి, గురునాథ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

సోమందేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం డీఎల్‌పీఓ శివనారాయణ తనిఖీచేశారు. ప్రజాపరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సంబంధించి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఇంతవరకు ఎన్ని అర్జీలు పరిష్కారం అయ్యాయని తదితర వివరాలను ఈఓఆర్డీ ప్రేమ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కానివాటిపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

వ్యక్తి మృతి

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ వ్యక్తి కిందపడి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఇందిరమ్మ కాలనీకి చెందిన చంద్రశేఖర్(56) మద్యం షాపులో మద్యం సేవించి బయటకు వచ్చి కిందపడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు కాలుజారి పడి ప్రాణాలు వదిలినట్లు వివరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం: ఎంపీడీఓ

రొద్దం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రొద్దం ఎంపీడీఓ కార్యాలయంలో విలేజ్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గోవిందప్ప, సర్పంచులు పరమేశ్, రూప, సోమశేఖర్‌రెడ్డి, మంజు, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, బాబు, చరిత, లక్ష్మీనారాయణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: పరిశుభ్రత పచ్చదనంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ గంగాధర్ మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. 2030నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి గ్రామ పంచాయతీల స్థాయిలో ప్రణాళికలు రూపొందించడం, అమలు చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుకా కామరాజు, అడ్మినిస్ట్రేషన్ అధికారి రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ పద్మ హాజరయ్యారు.

● **గుడిబండ:** గ్రామాల అభివృద్ధి కోసం అన్నిశాఖల అధికారులు పనిచేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, పంచాయతీల కార్యదర్శులు వివిధశాఖల అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి ప్రకాశ్, అమరేష్, హరీష్, చక్రవర్తి, రాధా, జ్యోతి, గౌరమ్మ పాల్గొన్నారు.

సోమందేపల్లి: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించాలో వివరిస్తూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రైనర్ యోగేశ్వర్ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చెత్తతో సంపద కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ ప్రేమ్‌కుమార్, ఏఓ నర్సింగరావు, భీమలింగేశ్వర్ పాల్గొన్నారు.

దాసన్నకు ఇందిరా ప్రియదర్శిని ప్రకృతి

పురస్కారం అందజేత

పావగడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విశ్వగ్రామోదయ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, కార్యదర్శి ఆర్‌డీ రొప్పం గ్రామానికి చెందిన దాసన్నకు ఇందిరా ప్రియదర్శిని పురస్కారం లభించింది. 18 సంవత్సరాలుగా మొక్కలను పెంచడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడంతో ఆయనను కర్ణాటక రాష్ట్ర ప్రకృతి కాలుష్య నియంత్రణ మండలి ఇందిరా ప్రియదర్శిని పురస్కారాన్ని అందించింది. రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే, ఆరోగ్యమంత్రి దినేష్ గుండురావు, వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి, ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ తదితరులు దాసన్నను బెంగళూరులోని జీకేవీకేలో మంగళవారం సన్మానించి పురస్కారాన్ని అందజేశారు.



పురస్కారాన్ని అందుకుంటున్న దాసన్న

వైభవంగా సుబ్రహ్మణ్య విగ్రహ ప్రాణప్రతిష్ఠ



స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతంతో అభిషేకం అనంతరం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సిద్ధేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.29 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, స్థానికులు

అమరాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి ఎంజేరు సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కింపును చేపట్టారు. దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు, ఉప కమిషనర్ కార్యాలయం రమేష్, ఎస్‌ఐ ఇషాక్ బాషా, ఏఎస్‌ఐ రామాంజనేయులు సమక్షంలో లెక్కింపు జరిగింది. రూ.3.29 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. లెక్కింపులో కుమారస్వామి, రామచంద్ర, తిప్పజ్జ, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఎంపీటీసీ ఓంకార్‌స్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

'రైతన్నా.. నీకోసం'లో టీడీపీ నాయకులు



ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తున్న నాయకులు

రొద్దం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు టీడీపీ నాయకులు సూచించారు. మంగళవారం రొద్దం మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామంలో రైతన్న నీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను వివరించారు. ఏ పంటలు ఏ కాలంలో వేస్తే సరమైన ధరలు అందుతాయో అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మనోహర్, నాగభూషణం, లింగప్ప, గోవిందప్ప, ధనుంజయ, లోకేష్, మహేష్, నాగిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు నాగభూషణం, మాధవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

● **రొళ్ల:** రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హులికుంట గ్రామంలో రైతన్న నీ కోసం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు దాసిరెడ్డి, వక్కళిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, మండల కన్వీనర్ ఈరన్న, ఉగ్రెగౌడ్, కృష్ణమూర్తి, నాగరాజు, నాగేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.



రైతుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు

● **లేపాక్షి:** ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వ్యవసాయరంగానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గలిబిపల్లిలో ఆయన రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి రైతులకు వ్యవసాయరంగంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు పంటలు సాగుచేసే సమయంలో వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డి, బేవనహళ్లి ఆనంద్, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, మండల కన్వీనర్ వెంకటాపురం అభి పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

● **గుడిబండ:** రైతుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, ఏఓ వీరనరేష్ పేర్కొన్నారు. మంగళవారం రైతన్న నీకోసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన గుడిబండలో ఇంటింటికి వెళ్లి రైతులకు అన్నదాత సుఖీభవ తదితర పథకాలపై కరపత్రాలు అందించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు చిత్రశేఖర్‌యాదవ్, బాలేపల్లి రాజు, నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

● **సోమందేపల్లి:** రైతులను అన్నిరకాలా అభివృద్ధి పథంలో నడిపించడం ప్రభుత్వ ధ్యేయమని ఏఓ విజయభారతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జూలుకుంట గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పంచసూత్రాలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అలైఖ్య, నాయకులు పాల్గొన్నారు.

● **పెనుకొండ:** మండలంలోని కొండంపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా సీటీ, ఐట, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతు వనిత పొలంలో 200కేజీలు ఘనజీవామృతం తయారుచేసి 30సెంట్లలో మోడల్ వేశారు. ఇందులో ముల్లంగి, బీట్రూట్, క్యారెట్ ప్రత్యామ్నాయ పంటలు విత్తనాలు నాటారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారులు, నాయకులు హనుమంతరావు పాల్గొన్నారు.